క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

డోన్ టౌన్: శ్రీతత్వమసి అయ్యప్పస్వామి దేవాలయంలో చేపట్టిన నిత్యాన్నదాన పథకానికి గురువారం పట్టణానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సీమ సుధాకర్‌రెడ్డి, మనోహరమ్మ దంపతుల కుమారుడు రామసుబ్బారెడ్డి, కోడలు హైమావతి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దాతలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు చలం, ప్రకాష్, గోపాల్, గోవిందు సత్కరించారు.

శ్రీవారి దర్శనానికి తరలిన భక్తులు

కొలిమిగుండ్ల: జీవితంలో ఒక్క సారైనా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలనేది ప్రతి హిందువు కోరిక. ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార భక్తులను టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఆలయాల నిర్మాణం జరుగుతున్న గ్రామాలకు చెందిన భక్తులను వైకుంఠ ద్వారా దర్శన భాగ్యం కల్పిస్తుంది. ఈ మేరకు గురువారం తెల్లవారు జామున పెద్దవెంతుర్ల ఎస్సీ కాలనీకి చెందిన 49 మంది భక్తులు వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమల బయలు దేరి వెళ్లారని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు చెప్పారు. భక్తులకు ఉచిత రవాణ సౌకర్యం, వసతి కల్పించి స్వామి దర్శనం కల్పిస్తారని పేర్కొన్నారు. జిల్లా నుంచి పది బస్సులు తిరుమలకు బయలు దేరి వెళ్లాయన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సెంటర్‌ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సంస్థ సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం మంగన్న ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, రఫీక్, విద్యావలంటీర్లు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయం తనిఖీ



సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ప్యాపిలి: డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో తీసుకుంటున్న చర్యల గురించి సీఐ శ్రీరాములు, ఎస్‌ఐ సీఎం రాకేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన విధుల పట్ల అలసత్వం వహించరాదని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలతో మమేకమై పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంచాల్సిన బాధ్యత ప్రతి పోలీసుపై ఉందన్నారు. మట్కా, నాటుసారా వంటి విషయాల్లో నిక్కచ్చిగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆకతాయిలకు, వాహన చోదకులకు తరచూ కౌన్సెలింగ్ ఇవ్వాలని, సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలని సూచించారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



పెంఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వెచ్చించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి సూచించారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను గురువారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనతో పాటు దాతల సహకారంతో ప్రతినెలా పేదలకు తమవంతు సాయంగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ గురుస్వామి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

డోన్: పింఛన్ల పంపిణీ వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని చిగురుమానుపేటలో గురువారం 15వ వార్డు సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, మహేంద్రనాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఆ వార్డులో నలుగురు ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా పింఛన్లు అందజేశారు.

అందరి సహకారంతో అభివృద్ధి

- 2024లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: అందరి సహకారంతో బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ప్రజా సక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని గుర్తు చేశారు. స్థానిక పొదుపు భవనంలో గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమానికి అతిథులుగా ఉమ్మడి జిల్లాల పరిశీలకులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు అప్జల్‌ఖాన్, దివంగత చల్లా రామకృష్ణారెడ్డి, దివంగత ఎర్రబోతుల వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతోపాటు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చల్లా, కాటసాని, ఎర్రబోతుల, బిజ్జం, కర్రా కుటుంబాలు ఎప్పటికీ ఒక్కటే అన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి తిరుగులేదన్నారు. 2019 ఎన్నికల్లో నాయకుల సహకారం, ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందానని, 2024లో జరిగే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం తథ్యమని కాటసాని స్పష్టం చేశారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ బలం అన్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అవుకు, బనగానపల్లె, కొలిమిగుండ్ల మండలాల్లో నాపరాతిపరిశ్రమపై వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి మైనింగ్ సెస్సు తగ్గించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు కార్యకర్తలు ఐకమత్యంగా వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించాలని వారు పిలుపునిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, రైతుభరోసా, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న విద్యాకానుక, విద్యా, వసతి దీవెనలతో పాటు మొత్తం 36 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ప్రత్యేకించి బనగానపల్లె నియోజకవర్గానికి జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని, రాబోయే కాలంలో తాగునీటి సమస్య ఎక్కడ ఉండదని ఎమ్మెల్యే కాటసాని స్పష్టం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: యూటీఎఫ్ 2023 క్యాలెండర్లను గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రకాష్, మండలశాఖ అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు కృష్ణయ్య, విజయ, గౌరవాధ్యక్షులు సుధాకర్, ఆర్థిక కార్యదర్శి విజయకుమార్, నాయకులు సతీష్‌కుమార్, డేవిడ్, శ్రీనివాసులు, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని లెప్రసీ, అంధుల కాలనీల్లోని 45 కుటుంబాలకు గురువారం నంద్యాల దయాసిస్ సీయస్‌ఐ ఆల్ సెంట్స్ చర్చి ప్రతినిధులు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ సామెల్ రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరిలో వీరికి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ థామస్, కార్యదర్శి కిరణ్ కుమార్, కోశాధికారి బాలయ్య, సభ్యులు జాన్ బాబు, అశోక్, డోన్ పాస్టర్లు లారెన్స్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. గురువారం నందిపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌తో పాటు రికార్డులు పరిశీలించారు. పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సమస్య తదితర అంశాలపై చర్చించారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన, డ్రాప్ అవుట్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న సీఐ ప్రియతంరెడ్డి

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, ప్రమాదాల కట్టడికి సహకరించాలని సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. ఆటో డ్రైవర్లు, వాహనచోదకులు మద్యం సేవించి డ్రైవింగ్ చేసి మీ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించడమే కాకుండా కేపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఈ సదర్భంగా సీఐ సూచించారు. అతివేగం ప్రమాదకరమని, నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ఆటోలకు బీమా చేయించుకోవాలన్నారు. బీమా లేకపోతే అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్సు విద్యార్హతతో సంబంధం లేకుండా ఇస్తారని, తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

పురుగు మందుతాగి వ్యక్తి మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని చనుగొండ్లకు చెందిన ఖాజా(43) గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు మందలించారనే మస్తాపంతో మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.

బండలు మీదపడి...

స్థానిక కొండపేటకు చెందిన రమణారెడ్డి(40)పై బండలు మీదపడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రాంఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న సొంత బండల డిపోలో లారీలో నుంచి బండలు దించుతుండగా ఒకే సారి ఐదు బండలుజారి మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని డోన్ ప్రబుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు.

మూడు ట్రాక్టర్ల సీజ్

మండల పరిధిలోని అబ్బిరెడ్డిపల్లి చెరువులో నుంచి గురువారం అక్రమంగా మట్టి తరలిస్తుండడంతో మూడు ట్రాక్టర్లను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, నాయకులు బీరవోలు నాగేశ్వర్‌రెడ్డి, దస్తగిరి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులు ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం పొంది మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఐదుగురికి మంజూరైన రూ. 4.55 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారు గురువారం బాధితులకు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన వీరస్వామికి రూ. 1.20 లక్షలు, దూదేకుల హుసేన్‌బీకి రూ.1.10 లక్షలు, కాట్రెడ్డి దస్తగిరి రెడ్డికి రూ. 45 వేలు, అంబాపురం గ్రామానికి చెందిన దగడ గుర్రెడ్డికి రూ. 1.10 లక్షలు, ముసలాయిచెర్వుకు చెందిన ఎద్దుల సామేలు రూ.70 వేల చెక్కును ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, యాదగిరి వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, ఎద్దులన్న, మునిస్వామి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్యాపిలి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలు పథకాలను అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్‌లక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్నవారి నుంచి వలంటీర్లు ధృవపత్రాలు సేకరించి సచివాలయంలో దరఖాస్తు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు అర్హత ఉన్నవారు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు. భవిష్యత్తులో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బొర్రామల్లికార్జునరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అలేబాదు బాలయ్య, ఫీల్డు అసిస్టెంట్ అయ్యన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రవీణ్, ఆనంద్, వెంకటస్వామి, రవి ప్రకాశ్, బాలశంకర్, చిన్న అయ్యన్న, భాస్కర్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి

డోన్ టౌన్: చదువుతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక బాలికల వసతి గృహంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు, ఆచారాలను ఎదురించి మహిళలకు చదువు చెప్పడంతోపాటు వితంతు వివాహాలు జరిపించిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. అనంతరం హిందీ ఉపాధ్యాయిని ఉమ, హాస్టల్ వార్డెన్లు లక్ష్మీబాయి, సుజాత, పీఈటీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, రోజారాణిలను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక డోన్ డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు లతీఫ్, రామమూర్తి, లక్ష్మి, అనురాధ, వాసవి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్ రావు

అవుకు: పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు అన్ని సదుపాయాలు కల్పించాలని ఎంఈఓ శ్రీధర్‌రావు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. జగనన్న విద్యాకానుక కిట్లలోని పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగ్ తదితర వాటిని విద్యార్థులు ప్రతిరోజు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఇచ్చిన ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకునే అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం చెర్లోపల్లె ప్రభుత్వ పాఠశాలను సందర్శించి జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, సురేంద్ర, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో అన్ని వసతులు కల్పిస్తాం



కర్నూలు కార్పొరేషన్ మీటింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న డోన్ మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: పట్టణంలో రూ.కోట్లతో స్టేషన్ రోడ్డులో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ కార్యాలయ భవనంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. డోన్ మున్సిపల్ ఈఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, సాధిక్‌తో కలిసి గురువారం ఆయన కర్నూలు కార్పొరేషన్ మీటింగ్ హాల్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వసతులతో నిర్మిస్తున్న డోన్ కార్యాలయాన్ని త్వరలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ చెప్పారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బీమా నగదు అందజేస్తున్న గుర్విరెడ్డి

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లె పంచాయితీ పరిధిలోని ఇద్దరికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన నగదును గురువారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి అందజేశారు. చింతలాయిపల్లెకు చెందిన సిరిగిరి సుధాకర్, ఎస్ చెన్నంపల్లెకు చెందిన బాలరాజు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు గుర్విరెడ్డి అందజేశారు. ప్రభుత్వం అందించిన సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైఎస్సార్ బీమాతో ఎంతో మంది బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భార్గవిలత, వైఎస్సార్‌సీపీ నేత జగన్మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

బనగానపల్లెరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల రికార్డులు సక్రమంగా ఉండాలని ఎంఈఓ స్వరూప సూచించారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని ఎంపీపీ, యూపీ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన వర్క్ బుక్‌లను ఉపాధ్యాయులు విధిగా తనిఖీ చేసి, తప్పులను సరిదిద్దాలన్నారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు ముఖ యాప్‌లోనే హాజరు వేయాలని సూచించారు.

బీమా చెక్కుల పంపిణీ

డోన్/డోన్‌టౌన్: పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలోని ఇద్దరు బాధితులకు వైఎస్ఆర్ బీమా రూ.లక్ష మొత్తాన్ని గురువారం అందజేశారు. గతేడాది జూలైలో కొండపేటకు చెందిన షేక్ బాబు అనారోగ్యంతో, అక్టోబరులో బలిజ రమణ క్యాన్సర్‌తో చనిపోయారు. షేక్ బాబు భార్య షేక్ మస్తాన్‌బీకి, రమణ భార్య బలిజ శ్రీదేవికి రూ. లక్ష చొప్పున వైఎస్సార్ బీమా నగదును కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి, నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ గంగాదేవి, వెల్ఫేర్ సెక్రటరీ నాగేశ్వరరావ్, వలెంటీర్లు జయమనోజ్‌కుమార్, ఇంథియాజ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జనార్దన్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి సీఐ అందించిన సమాచారం మేరకు .. సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన మహేశ్వరీ కుమారుడు రాఘవేంద్ర ఉదయం ఇంటి వద్ద నుంచి స్కూల్‌కు బయలు దేరాడు. ఆ సమయంలో చదువు విషయంలో తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన రాఘవేంద్ర పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వెళ్లలేదు. కుమారుడు రాకపోవడంతో చుట్టుపక్కలవారిని విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు విద్యార్థి అదృశ్యం కేసు నమోదు చేశారు. తెలుపురంగు చొక్కా, నీలంరంగు ప్యాంట్ ధరించిన విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు 9121101173, 74 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

రైతన్నకు అండ... రుణపరిమితి పెంపు

- ధరలకు అనుగుణంగా రుణాల మంజూరు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం



శనగ పంటకు పిచికారీ చేస్తున్న రైతులు

బనగానపల్లె: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుంది. రైతులకు అండగా నిలుస్తూ వ్యసాయాభివృద్ధికి చేయూతనిస్తుంది. పెట్టుబడి సాయం అందజేస్తూ అసరగా నిలిచిన ప్రభుత్వం రైతులకు అన్నిరకాల సేవలందించేందుకు సచివాలయాలకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పింది కూడా. నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేయడమే కాకుండా సాగులోనూ సూచనలు చేస్తున్నారు ఆర్బీకే సిబ్బంది. ఈ నేపథ్యంలో రైతులకు మరింత అండగా నిలిచేందుకు రుణ పరిమితి సైతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారుతున్న పరిస్థితుల మేరకు పెట్టుబడులు పెరుగుతున్నందున పంట రుణాలను సైతం పెంపుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులు విధివిధానాలను రూపొందించారు. జిల్లాలో పండుతున్న పంటలు సాగు విస్తీర్ణం , రైతుల అంచనాలను రూపొందించి ఇటీవలే జిల్లా స్థాయి అధికారులు ప్రభుత్వానికి ఆమోదం కోసం నివేదికను పంపడం జరిగింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలో రైతులు సాగుబడి కోసం అందించే రుణాలను నిర్ధారించనున్నారు. రానున్న ఖరీఫ్, రబీలకు రైతులకు రుణ పరిమితి బ్యాంకుల నుంచి 20–30శాతం పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో వరితో పాటు ఆయిల్‌ఫాం, అపరాలు, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తుండగా సుమారు 8లక్షల మంది సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులు ఉన్నారు.

ప్రతిపాదనలు ఇలా

ప్రస్తుతం వరి పంటకు రూ.37–38వేలు రుణం అందిస్తుండగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక ఆధారంగా రూ.40వేల వరకు లభిస్తుంది. అలాగే వేరుశనగకు రూ.25–27 అందిస్తుండగా రూ.30–32వేలు అందజేసే అవకాశం ఉంది. మినుము, పెసర పంటకు రూ.16వేలు ఉండగా రూ.20వేలకు పెంచారు. పత్తికి రూ.30 నుంచి 40వేలు, పొగాకు రూ.80 నుంచి 85వేలు, అయిల్ ఫాంకు రూ.40నుంచి 52వేలకు రుణపరిమితి పెంచనున్నారు. అలాగే పాడిపరిశ్రమకు సంబంధించి ఆవుకు రూ.27 నుంచి 30వేలు, గేదేకు రూ.30 నుంచి రూ.33వేలు, గొర్రెలు, మేకలకు రూ.38 నుంచి 40వేలకు రుణపరిమితి పెంచారు. ఇలా ప్రతి పంటకు, పాడిపరిశ్రమలో ప్రతి జీవానికి రుణపరిమితి పెంచనున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రస్తుతం పెట్టుబడి ఖర్చులు అధికంగా పెరుగుతున్నాయి. ఏ పంట పడించాలన్న పెట్టుబడి తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో రుణాల పెంపుదల చేసేందుకు ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం హర్షణీయం. రైతులు పెట్టుబడికి రుణాలు అధికంగా రావడం మూలంగా ఉపశమనం పొందుతారు.

– ఎం శివరామ్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు

రుణాలు పెరిగే అవకాశం



ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్యాంకర్లు రుణాలను అధికంగా అందించే అవకాశం ఉంది. 20–30శాతం అధికంగా ఇవ్వడం వలన రైతులు పెట్టుబడికి ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది. బ్యాంకర్లు పెరిగిన మేరకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. – సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె మండలం